మరింత మంచి చేయడానికి వచ్చాం

- జగనన్నను, నన్ను ఎన్నికల్లో ఆశీర్వదించండి
- రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకు వేయండి
- ప్రచారంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్
- జెడ్పీ చైర్‌పర్సన్ హారికతో కలిసి విస్తృతంగా ఎన్నికల ప్రచారం


ముచ్చలిగుంటలో ఉప్పాల రమేష్(రాము), హారికను గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్తులు

పెడన: 'పేదలకు మేలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరింత మంచి చేయడానికి మీ ముందుకు వచ్చారు. మీకు దగ్గరగా ఉండి సేవలందించడానికి నన్ను పంపించారు. ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లను ఫ్యాను గుర్తుకు వేసి మమ్మల్ని ఆశీర్వదించండి' అని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము) ప్రజలను కోరారు. ఆయన పెడన మండలంలోని ముచ్చలిగుంట, మర్రిగుంట, చేవేంద్రపాలెం, చేవేంద్ర గ్రామాల్లో కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలిసి మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించారు. వారికి గ్రామస్తుల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. భారీ పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సామాజిక న్యాయం పాటిస్తూ పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అందించారన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా ఫలాలను అందుకున్న ఘనత మన రాష్ట్ర ప్రజానీకానికే దక్కిందన్నారు. అవ్వాతాతలు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, ఇతర లబ్ధిదారులకు ఇంటి వద్దనే పింఛన్లు ఇచ్చిన విధానం దేశంలో ఎక్కడా లేదన్నారు. అటువంటి మంచి చేసిన ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకుంటే మనకు మరింత మంచి జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి గత ఎన్నికల్లో హామీలన్నింటినీ అమలు చేయడమే కాకుండా మరికొన్ని అదనంగా చేసి చూపించిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి, పేద ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించే ముఖ్యమంత్రిని మనం వదులుకోకూడదని, అటువంటి మంచి వ్యక్తికి వెన్నంటే ఉందామని అన్నారు. స్థానికంగా తనను ఎమ్మెల్యేగా, సింహాద్రి చంద్రశేఖరరావును ఎంపీగా గెలిపించడానికి రెండు ఓట్లు కూడా ఫ్యాను గుర్తుకు వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, ఎంపీపీ రాజులపాటి వాణి, పార్టీ నాయకులు రాజులపాటి అచ్యుతరావు, సర్పంచులు ఉచ్చుల భాస్కరరావు, పూరిళ్ల దుర్గాభవాని, భీమనబోయిన భూలక్ష్మి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బి.శివరామ్, ఎంపీటీసీ సభ్యుడు అంకెం గిరిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లమోతు శ్రీను, పార్టీ నాయకులు మీసాల సత్యనారాయణ, వేముల సత్యనారాయణ, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

వసతిగృహం రోడ్డు అభివృద్ధి



మచిలీపట్నంటౌన్: నగరంలోని నోబుల్‌కాలనీలో ఉన్న కొండా జ్ఞానయ్య బాలుర వసతి గృహం రోడ్డును మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి చేశారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ డైరెక్టర్ వెంకట్రావ్, ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ డి.ఆశాలత ఈ రోడ్డును మంగళవారం ప్రారంభించారు. ఫౌండేషన నిర్వాహకుడు ఫణి, కె.వేణుకుమార్, దైవపు రాధాకృష్ణ పాల్గొన్నారు.

మానవతా సంస్థ ఆధ్వర్యంలో 203వ నేత్రదానం



నాగాయలంక: గ్రామంలోని ఒకటో వార్డులో మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధుడు తలశిల సుబ్బారావు(87) నేత్రాలను విజయవాడ (తాడిగడప) ఎల్వీప్రసాద్ కంటి ఆసుపత్రికి దానం చేశారు. మృతుడి భార్య యశోదమ్మ, కుమార్తెలు తలశిల అరుణ, రమాదేవి ఇతర కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా నేత్రదానానికి ముందుకొచ్చారు. స్థానిక సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కె.వెంకట నారాయణలకు సమాచారం అందించగా వారి సహకారంతో ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ సాయి బృందం మృతుని నేత్రాల నుంచి కార్నియాలను సేకరించారు. తమ సంస్థ ద్వారా ఇప్పటికి సేకరించిన నేత్రాలు 203లకు చేరాయని రఘుశేఖర్ వెల్లడించారు.

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని 38వ డివిజన్‌లో మంగళవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గొడుగుపేటలోని కన్యకాపరమేశ్వరి రైస్ మిల్ సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో శుభ్రంచేశారు. ఆ ప్రాంతంలో డ్రెయిన్లలో పేరుకుపోయిన సిల్టును తొలగించారు. ఈ పనులను ఆ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీకాకోళపు నరసింహగుప్తా పర్యవేక్షించారు.

ఆంజనేయస్వామికి కర్బూజాల నైవేద్యం



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కర్బూజాలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు మజ్జిగ అందజేశారు.

ధ్రువపత్రాలు అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని సుకర్లాబాద్‌లోని నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్‌లో మంగళవారం కిడ్స్ కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతూ పై తరగతులకు వెళ్తున్న విద్యార్థులకు ధ్రువపత్రాలు, మెడల్స్‌ను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అందజేశారు. అంతర్జాతీయంగా జరిగిన ఒలంపియాడ్ పరీక్షలు ప్రతిభ చూపిన 120 మంది విద్యార్థులకు బంగారు, వెండి కాంస్య పతకాలను ఆమె అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ సీతామహాలక్ష్మి డీన్ శ్రీకాంత్, ఏజీఎం దేవేంద్ర, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో తాగునీటి సమస్య నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ డి.కె.బాలాజీ తెలిపారు. సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఉపాధి హామీ పథకం పనుల కల్పన అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. జిల్లాలో తీసుకున్న చర్యలను సీఎస్‌కు వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ కాలువల ద్వారా వస్తున్న నీటిని గ్రామాల్లో తాగునీటి చెరువులు, పట్టణాల్లో సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. మరో నాలుగు రోజులు కాలువల ద్వారా నీటి సరఫరా ఉంటుందని ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, డీపీఓ నాగేశ్వరనాయక్, మునిసిపల్ కమిషనర్లు బాపిరాజు, పి.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డీఈ సీహెచ్ మురళీ పాల్గొన్నారు.

మూడెకరాల వరిగడ్డి వామి దగ్ధం

ఘంటసాల: మండలంలోని దేవరకోటలో మూడు ఎకరాల గడ్డివామి మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. గ్రామానికి చెందిన పరిశే వడ్డీకాసులుకు చెందిన గడ్డివామి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మొవ్వ ఫైర్ స్టేషన్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. వీఆర్వో నాగేశ్వరరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి


తాగునీటి సమస్య గురించి మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సత్యనారాయణ

కోడూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి సత్యనారాయణ కోరారు. దిగువ కాలువలకు నీరు వెళ్లపోవడంతో చెరువుల కూడా నిండ లేదని, నీటిని నింపేందుకు కూడా ప్రత్యామ్నాయ్య మార్గాలు చూడాలని పేర్కొన్నారు. అవసరమైన ట్యాంకర్ల ద్వారా తాగునీటి అందించాలని కోరారు. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పని దినాలు కల్పిస్తున్నామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తెలిపారు. కూలీల ఆరోగ్యంపై దృష్టి పెట్టడంతో పాటు పని ప్రాంతంలో తాగునీటి, టెంట్లను కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. వేసవిలో పనిదినాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏప్రిల్, మే నెలలో ఎండ వేడి ఎక్కువగా ఉండే అవకాశాలు ఉండడంతో ప్రజలు డీహైడ్రేషన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈఓపీ ఆర్డీ నాగరేవతి, ఏఓ పాండురంగారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు 1,566 మంది దరఖాస్తు



పెడన: పెడన నియోజకవర్గంలో ఎన్నికల విధులకు హాజరయ్యేవారితో పాటు ఇతర శాఖలకు చెందిన వారు మొత్తం 1,566 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేశారు. వారిలో పీఓలు, ఏపీఓలు 525 మంది, ఇతర పోలింగ్ సిబ్బంది 762 మంది, పోలీస్ శాఖ సిబ్బంది 146 మంది, ఆరోగ్యశాఖ సిబ్బంది 54 మంది, వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు 79 మంది ఉన్నారు. మొత్తం 1,566 మంది పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయగా వారిలో పెడన నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థులకు ఓటు వేసే ఉద్యోగులు 640 మంది, మచిలీపట్నం నియోజకవర్గానికి సంబంధించిన అభ్యర్థులకు ఓటు వేసేవారు 610 మంది ఉన్నారు. మిగిలిన 316 మంది వివిధ నియోజకవర్గాల్లోని పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారని పీఓ వెంకటరమణ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు గడువు మంగళవారంతో ముగిసిందని, 1,566 మంది దరఖాస్తు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

తరకటూరులో పూరిల్లు దగ్ధం



గూడూరు: మండలంలోని తరకటూరులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సదర్ల విజయలక్ష్మికి చెందిన పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. విజయలక్ష్మి ఉపాధిహామీ పనులకు వెళ్లగా ఉదయం తొమ్మిది గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని సమాచారం. ప్రమాద సమాచారం అందుకున్న బందరు అగ్నిమాపక దళం ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. ప్రమాదం సంభవించిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సామగ్రి కాలిబూడిదైంది. దాదాపు రూ.2.5 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలిని తహసీల్దారు ఎస్.ఎస్.శాంతి, సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ పరామర్శించారు. ప్రభుత్వ తక్షణ సహాయం కింద నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు.

కోదండ రాముని సన్నిధిలో మహా సంప్రోక్షణ


శ్రీ సీతారామ లక్ష్మణ స్వామి విగ్రహాలు


రావివారిపాలెంలో మహాపూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

మోపిదేవి: మండలంలోని రావివారిపాలెంలోని కోదండ రామాలయంలో శ్రీసీతారాముల విగ్రహ పతిష్ట జరిగి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహా సంప్రోక్షణ, పవిత్రోత్సవం, ప్రత్యేక హోమాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజైన మంగళవారం వేదపండితుల మంత్రోచ్చరణతో మహా పూర్ణాహుతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడుసుమిల్లి శ్రీనివాసరావు బ్రహ్మత్వంలో ఉదయం గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, దీక్షాస్వీకరణ, అంకురారోహణ, నాంది, మాతృకాపూజ, మండల పూజలు, అగ్ని ప్రతిష్ట జరిగాయి.

స్వామికి యాగ మండప పూజలు, కళా ఆవాహన, పూర్ణాహుతి, అవభృతస్నానం, అభిషేకం, స్నపన అభిషేకాలు, అర్చనలు, అభిషేకాలు, వేద పారాయణం, నీరాజన మంత్ర పుష్పాలతో హోమాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు సీతారాముల కల్యాణ వేడుక వైభవంగా జరుగుతుందని, రాత్రికి స్వామివారి ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేస్తామన్నారు. గ్రామస్తులు పర్చూరి శ్రీనివాసరావు దంపతులు, కావూరి మురళీ దంపతులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పర్చూరి అంజయ్య, గద్దె బాబూరావు, గద్దె శ్రీహరి, రావి సురేష్, బాబి, అరజా వెంకటేశ్వరావు, పెద్ద ఎత్తున మహిళలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఆలయాల ముస్తాబు


నవమిని పురస్కరించుకొని విద్యుత్‌దీపాలతో అలంకరించిన లింగారెడ్డిపాలెం రామమందిరం


విద్యుత్ దీపాల వెలుగుల్లో పెడన బస్టాండు సమీపంలోని అభయాంజనేయస్వామి దేవస్థానం

కోడూరు: శ్రీరామనవమి వేడుకలకు మండలంలోని రామమందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. కోడూరు ప్రధాన సెంటర్‌లోని రామాలయం వద్ద బుధవారం ఉదయం సీతారామచంద్ర స్వామివారి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. షిర్డీసాయి దివ్య ధాన్యజ్ఞాన మందిరంలో స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. లింగారెడ్డిపాలెంలోని శ్రీరామ మందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. బడేవారిపాలెం, ఉల్లిపాలెం, వి.కొత్తపాలెం, మాచవరం, యర్రారెడ్డివారిపాలెం, ఇస్మాయిల్‌బేగ్‌పేట గ్రామాల్లోని రామాలయాల వద్ద కూడా నవమి వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

శ్రీరామనవమికి ముస్తాబైన ఆలయాలు

పెడన: శ్రీరామనవమి వేడుకలకు పట్టణంతో పాటు మండలంలోని శ్రీకోదండ రామాలయాలు, సీతారాముల ఆలయాలు, అభయాంజనేయస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఆయా ఆలయాల కమిటీలు, ఏర్పాట్లు చేశారు. సంప్రదాయ బద్ధంగా తాటాకు పందిళ్లు వేసి వాటి కింద రాములోరి కల్యాణాన్ని అత్యంత కనుల పండువగా నిర్వహించనున్నారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు


భక్తులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న రవికాంత్ యాదవ్ తదితరులు

మోపిదేవి: అఖిలభారత యాదవ సంఘం ఆధ్వర్యంలో మోపిదేవి ప్రధాన సెంటర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. పంచాయతీ పాలకవర్గ సభ్యుడు కొలుసు శివరాజేష్(బంటి) ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ సంఘం అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు గొరిపర్తి రవికాంత్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానానికి వేసవిలో వచ్చే భక్తులకు సౌకర్యార్థం ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి మంగళ, ఆదివారాల్లో మజ్జిగ, మిగతా రోజుల్లో చల్లని మంచినీరు పంపిణీ చేస్తామని వివరించారు. తొలుత శ్రీ కృష్ణుని విగ్రహానికి పూజలు చేశారు. సంఘ నాయకులు గొరిపర్తి సత్యనారాయణ(కఠారి), గొరిపర్తి వీర రాఘవయ్య, కారుమూరి గోపీ, డొక్కు మురళీ, కొలుసు మురళీ పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం సాధ్యం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సింహాద్రి వికాస్, నిశ్చల, డాక్టర్ సృజన, డాక్టర్ రంగనాథ్

ఘంటసాల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తనయుడు సింహాద్రి వికాస్ అన్నారు. ఘంటసాల గోటకం ఏ,బీ కాలనీలు, క్రిస్టియన్‌పేటలో ఎమ్మెల్యే రమేష్ బాబు తనయుడు సింహాద్రి వికాస్, కుమార్తెలు నిశ్చల, డాక్టర్ సృజన, అల్లుడు డాక్టర్ రంగనాథ్ మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారంచేశారు. ఇంటింటికీ వెళ్లి స్థానికులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుకుంటూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వికాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ ఆర్థిక భరోసా కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాక గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఈ ఎన్నికల్లో దుష్టచతుష్టయం ఒకవైపు, జగనన్న ఒకవైపు పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు మూడు పార్టీలు ఏకమయ్యాయని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వచ్చి సంక్షేమ పాలన అందించేందుకు అవనిగడ్డ ఎమ్మెల్యేగా సింహాద్రి రమేష్ బాబుకు, బందరు ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని వికాస్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల మార్కెట్ కమిటీ చైర్మన్ వేమూరి వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల మురళీకృష్ణ, కొత్తపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్ తాతినేని కృష్ణారావు, పార్టీ నాయకులు వేమూరి ప్రవీణ్, దిరిశం పిచ్చేశ్వరరావు, గోనెపాటి పిచ్చేశ్వరరావు, తిరందాసు భావనారుషి, అంగడాల నాగరాజు, మూల్పూరి వెంకయ్య, పడమట వీరకుమార్, వీరమల్లు శ్రీనివాసరావు, చికినం బాలాజీ, ఆకురాతి భాస్కరరావు, గొర్రెపాటి గోపాలకృష్ణ, కొడాలి చిన్నయ్య, గుర్రం అంజియ్య, నడకుదురు గాంధీ, కొడాలి బాబూరావు, మేరుగు ప్రకాశరావు, కొడాలి చినపండు, తిరుమలశెట్టి సీతారాంబాబు, వాసు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

- భద్రాద్రి రామాలయంలో 108 కలశాలతో అభిషేకం
- పలు రామాలయాల్లో నేడు శ్రీరామనవమి వేడుకలు


సీతారాముల కల్యాణానికి ముస్తాబైన శ్రీ వైకుంఠ రామమందిరం


టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీరామనవమి పందిరి

మచిలీపట్నంటౌన్: శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు నగరంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. పలు కాలనీలతో పాటు ప్రధాన రహదారుల్లో ఉన్న రామాలయాల వద్ద సీతారాముల కల్యాణ వేడుక నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రధాన రహదారిలోని రుస్తుంబాద శ్రీ భద్రాద్రి శ్రీరాముల ఆలయంలో శ్రీరామనవమి వేడుకలను జరిపించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం పది గంటలకు శ్రీ భద్రాద్రి సీతారామ కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించనున్నారు. వందలాది మంది భక్తులు ఈ వేడుకకు హాజరుకానున్నారు. భక్తులకు అన్నసమారాధన చేయనున్నారు. లక్ష్మీటాకీసు సెంటర్‌లోని వైకుంఠ రామ మందిరం వద్ద శ్రీరామనవి ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం జరిగే సీతారాముల కల్యాణంలో ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), జయసుధ దంపతులు పీటలపై కూర్చోనున్నారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లలో మండపాలను ఏర్పాటు చేశారు. పానకాలు అందజేసేందుకు కూడా సన్నాహాలు పూర్తి చేశారు.

108 కలశాలతో అభిషేకం

శ్రీ భద్రాద్రి శ్రీరాముల వారి ఆలయంలో వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, బలిహరణ, ఎదుర్కోలు సన్నాహం కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రికి స్వామివారికి అశ్వవాహన సేవ, అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహించారు.

హింసాత్మక ఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ బాలాజీ


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ. చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ తదితరులు

చిలకలపూడి(మచిలీపట్నం): ఎన్నికల్లో హింసాత్మక ఘటనలు జరగకుండా విజిలెన్స్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం, పోలీస్ అధికారులకు మంగళవారం సమావేశం నిర్వహించి శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం, గంజాయి వంటి మాదకద్రవ్యాలను నియంత్రించాలన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందు మద్యం విక్రయాల నిషేధాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో లైసెన్స్‌డ్ ఆయుధాలు ఉన్న వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల్లో హింసాత్మక సంఘటనలు తావులేకుండా రౌడీషీటర్లను బైండోవర్ చేయాలన్నారు. రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ మాట్లాడుతూ.. ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల వాహనాలకు జీపీఎస్ సౌకర్యం కల్పించామన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లు ప్రారంభం కానున్న దృష్ట్యా ప్రొటోకాల్ ప్రకారం రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద భద్రతా చర్యలు పటిష్టంగా అమలు పరచాలన్నారు. ఏఎస్పీ జి.వెంకటేశ్వరరావు, రిటర్నింగ్ అధికారులు ఎం.వాణి, పి.పద్మావతి, దాసి రాజు, పి.వెంకటరమణ, శ్రీదేవి, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జనమంతా జగనన్న వైపే


సీతారామపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు

ఎన్నికల ప్రచారంలో పేర్ని కిట్టు

కోనేరుసెంటర్: గడిచిన ఐదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) పేర్కొన్నారు. ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని, వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమని అన్నారు. మంగళవారం సాయంత్రం మచిలీపట్నం మండలం పరిధిలోని సీతారామపురం, పల్లెతాళ్లపాలెం గ్రామాల్లో పేర్ని కిట్టు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ప్రతి గడపకూ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా పేర్ని కిట్టు మాట్లాడుతూ.. 2014 నుంచి 2018 వరకు తెలుగు దేశం ప్రభుత్వ పాలన, 2019 నుంచి 2024 వరకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలోని వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. వచ్చే నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఓటును విజ్ఞతతో వైఎస్సార్ సీపీకి వేసి గెలిపించాలని కోరారు.